సాక్షి సిద్దిపేట
బుధవారం । 26 । మార్చి । 2025



.. మడిమడికో రకం

పల్లేరులు మొలిచిన చోటే పసిడి పంటలు పండిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు ఓ రైతు..

వివరాలు 8లో ▸



..పునాదులకే పరిమితం

పేదల సొంతింటి కల పునాది దశలోనే నిలిచిపోవడంతో లబ్ధిదారుల్లో నిరాశ నెలకొంది.

వివరాలు 9లో ▸

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
బుధవారం సా. 6.34 గం.	గురువారం ఉ. 4.53 గం.

న్యూస్‌రీల్

వాటర్ క్యూరింగ్‌కు చర్యలు



సీసీ రోడ్డుపై ఏర్పాటు చేసిన వాటర్ క్యూరింగ్

సాక్షి ఎఫెక్ట్

మిరుదొడ్డి(దుబ్బాక): అభివృద్ధి పనుల్లో కొరవడిన నాణ్యతపై అధికారులు స్పందించారు. సీసీ రోడ్ల పనుల్లో నాణ్యత కొరవడుతోందంటూ ఈ నెల 24న 'సాక్షి'లో వచ్చిన 'పనులు హడావిడి.. నాణ్యత కొరవడి' అన్న పరిశీలనాత్మక కథనానికి జిల్లా అధికార యంత్రాంగం స్పందించింది. మండల కేంద్రమైన మిరుదొడ్డిలో నిర్మించిన సీసీ రోడ్డుకు వాటర్ క్యూరింగ్ చేయాల్సిందిగా అధికారులు కాంట్రాక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. 15 రోజుల నుంచి వాటర్ క్యూరింగ్ లేని సీసీ రోడ్డుపై గడ్డిని పరిచి వాటర్ క్యూరింగ్‌కు చర్యలు చేపట్టారు.

నేటి నుంచి మూడో విడత మూల్యాంకనం

సిద్దిపేటఎడ్యుకేషన్: ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షల జవాబు పత్రాల మూడో విడత మూల్యాంకనం బుధవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు జిల్లా ఇంటర్ విద్యాధికారి రవీందర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10గంటలకు కెమిస్ట్రీ, కామర్స్, హిస్టరీ అధ్యాపకులు మూల్యాంకన కేంద్ర కార్యాలయంలో రిపోర్టు చేయాలని తెలిపారు. జిల్లాలోని అన్ని కళాశాలల ప్రిన్సిపల్స్ అధ్యాపకులను రిలీవ్ చేయాలని సూచించారు.

రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

చేర్యాల(సిద్దిపేట): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి ప్రజలు, నాయకులు క్షీరాభిషేకం చేశారు. కమలాయపల్లి, అర్జునపట్ల గ్రామాలను మద్దూరు మండలం నుంచి చేర్యాల మండలంలోకి కలుపుతూ గెజిట్ విడుదల చేసిన సందర్భంగా మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్క, ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, జనగామ నియోజకవర్గఇన్‌చార్జి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి చిత్రపటాలకు కమలాయపల్లి గ్రామస్తులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ గ్రామాలను చేర్యాల మండలంలో పూర్తి స్థాయిలో కలిపేందుకు కృషి చేసిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీఎంపై విమర్శలు తగవు

డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి



గజ్వేల్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించడం తగదని డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి అన్నారు. మంగళవారం గజ్వేల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గజ్వేల్‌పై సీఎం సవతి తల్లి ప్రేమ చూపుతున్నారంటూ హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలపై మండిపడ్డారు. గజ్వేల్ ప్రజలకు హరీశ్‌రావు 24గంటలూ అందుబాటులో ఉండి అభివృద్ధిని పరుగులెత్తిస్తారని గతంలో కేసీఆర్ చెప్పినా హరీశ్‌రావు ఏనాడూ పట్టించుకోలేదన్నారు. సిద్దిపేటలో వేగంగా అభివృద్ధి పనులు పూర్తయితే గజ్వేల్‌లో మాత్రం పెండింగ్‌లో పడ్డాయన్నారు. ఇందుకు హరీశ్‌రావే కారణమని ఆరోపించారు.

సీల్డ్ టెండర్ల ఆహ్వానం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లాలోని 27 పీఎంశ్రీ ప్రభుత్వ పాఠశాలల్లో శానిటరీ ప్యాడ్స్ సరఫరా చేయడానికి సీల్డ్ టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టెండర్ ఫారం ధర రూ.2000, ఈఎండీ ధర రూ.50వేలు ఉంటుందన్నారు. టెండర్ ఫారాలు ఈ నెల 28 వరకు విద్యాశాఖ కార్యాలయంలో పొందాలన్నారు. పూర్తి చేసిన ఫారాలను బాక్స్‌లో వేయాలన్నారు. సీల్డ్ టెండర్లను ఈ నెల 29న ఉదయం 11గంటలకు జేపీసీ కమిటీ ఆధ్వర్యంలో తెరుస్తామని తెలిపారు.

మూగ వేదన.. అరణ్య రోదన

వన్యప్రాణులకు వేసవి గండం



కోహెడ మండలంలోని శనిగరంలో ఎండిపోయిన చెలమ

- దాహార్తితో విలవిల
- జిల్లాలో 23వేల హెక్టార్లలో అడవి
- వట్టిపోయిన చెలమలు
- నీరులేక చెత్తాచెదారంతో దర్శనమిస్తున్న సాసర్‌పిట్లు
- దృష్టి సారించని అధికారులు

సాక్షి పరిశీలన

వేసవిలో మనుషులే కాదు.. ఇతర జీవులూ ఉష్ణతాపంతో ఉక్కిరిబిక్కిరి కావడం పరిపాటి. సమయానికి తాగునీరు దొరక్కపోతే అవస్థలు పడక తప్పదు. నిత్యం జనారణ్యంలో సంచరించే జంతువులు, పక్షులకు నీటి కొరత ఉండకపోవచ్చు గానీ.. వన్యప్రాణుల తిప్పలు అన్నీఇన్నీకావు. ఇప్పటికే ఎండల తీవ్రతతో వాగులు, వంకలు, చెలమలు వట్టిపోతున్నాయి. దీంతో వన్యప్రాణులు నీటి జాడ కోసం అల్లాడుతున్నాయి. అటవీ శాఖ అధికారులు సాసర్ పిట్లలో నీటిని నింపకపోవడంతో మూగరోదనతో అలమటిస్తున్నాయి. 'సాక్షి' బృందం పలు అటవీ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సాసర్ పిట్లను పరిశీలించగా పలు వాస్తవాలు వెలుగుచూశాయి.

– సాక్షి, సిద్దిపేట

జిల్లాలోని 20 మండలాల్లో 23,336 హెక్టార్ల అటవీ విస్తీర్ణం ఉంది. వీటిలో దుప్పులు, నెమళ్లు, మౌస్‌డీర్‌లు, జింకలు, అడవి పందులు ఇతరత్రా జంతువులు పెరుగుతున్నాయి. గతంలో వన్యప్రాణుల దాహార్తిని తీర్చేందుకు 126 సాసర్ పిట్స్, చెలమలను అందుబాటులోకి తీసుకవచ్చారు. వాటిలో నీటిని నింపితే అటవీ జంతువులు దాహంతో ఉన్నప్పుడు అక్కడికి వచ్చి నీటిని తాగి ఉపశమనం పొందేవి. ప్రతి ఏటా ఫిబ్రవరి నుంచే నీటిని నింపేవారు. నెలలో నాలుగు నుంచి ఐదు సార్లు నీటిని నింపాలి. అయితే ఈ ఏడాది వేసవి కాలం ప్రారంభమై ఎండలు ముదురుతున్నా ఇప్పటి వరకు నీటిని నింపేందుకు అటవీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. చెలమలు ఎండల తీవ్రతకు నీళ్ల పలు చోట్ల అడుగంటిపాయాయి. సిద్దిపేట అర్బన్ పార్క్‌లో నీటి ట్యాంకర్, ట్రాక్టర్ ఉన్న సైతం దానితో సాసర్ పిట్‌లలో నీళ్ల పోయడకుండా నిర్లక్ష్యం చేస్తున్నారు.

నిధులు లేవని..

నిధులు లేవని సాసర్ పిట్లలో నీటిని పోసేందుకు చర్యలు చేపట్టడంలేదు. సోలార్ పంప్‌సెట్లు ఉన్నా వాటిని అటవీ అధికారులు పలు చోట్ల వినియోగంలోకి తీసుకురావడం లేదు. దీంతో అడవి జంతువులు తాగునీటి కోసం అల్లాడుతున్నాయి. తాగునీటి కోసం అటవీ శాఖ అధికారులు ఎలాంటి ఏర్పాట్లు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సాసర్ పిట్‌లలో నీటిని పోయాలని వన్యప్రేమికులు కోరుతున్నారు.

రేంజ్	సాసర్ పిట్స్	చెలమలు
సిద్దిపేట	10	10
దుబ్బాక	31	0
హుస్నాబాద్	19	0
గజ్వేల్	66	33

పక్క ఫొటోలో కనిపిస్తున్నది సిద్దిపేట అర్బన్ పార్క్‌లో వన్యప్రాణుల దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటు చేసిన సాసర్ పిట్. అర్బన్ పార్క్ (తేజోవనం) దాదాపుగా 500 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఇందులో జింకలు, నెమలి, మూషిక జింకలు, వివిధ పక్షులున్నాయి. వాటి దాహార్తిని తీర్చేందుకు గతంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో ఐదు సాసర్ పిట్లను నిర్మించారు. వారానికి ఒకసారి వాటిని నీటిని నింపాలి. పార్కులోని నాలుగు సాసర్ పిట్లను పరిశీలించగా రెండు నీళ్ల లేక ఎండిపోయి ఉన్నాయి. మరో రెండింటిలో ఎప్పుడో పోసినవి కొన్ని నీళ్లుండగా దుర్వాసన వస్తోంది.





చిన్నకోడూరు మండలం మైలారం, అల్లిపూర్, చౌడారం గ్రామాలలో మొత్తంగా 1,100 హెక్టార్ల విస్తీర్ణంలో అడవి ఉంది. అందులో జింకలు, అడవి పందులు, నెమలిలు, హైనాలు, చిరుత పులులు ఉన్నాయి. తాగునీరు లభించకపోవడంతో రాత్రి వేళ గ్రామాల్లోకి హైనాలు వస్తున్నాయి. పలు మార్లు గొర్రెలపై దాడి చేసిన సంఘటనలున్నాయి. చౌడారం అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన సాసర్ పిట్‌లో పాకురు పట్టి.. కొద్దిగా నీళ్ల కనిపించాయి.

సిద్దిపేట రూరల్ మండలం చింతమడక గ్రామ శివారులో 90 ఎకరాల విస్తీర్ణంలో అటవీ ప్రాంతం ఉంది. ఇందులో కొండ గొర్రెలు, జింకలు, అడవి పందులు, నెమళ్ల జీవనం కొనసాగిస్తున్నాయి. వీటి దాహార్తిని తీర్చేందుకు రెండు సాసర్ పిట్‌లను ఏర్పాటు చేశారు. అందులో ఒక దానిలో పూర్తిగా నీళ్ల లేవు, మరో దానిలో కొన్ని నీళ్ల మాత్రమే కన్పించాయి.



నిధులు రాగానే..

సాసర్ పిట్లలో నీటిని పోసేందుకు నిధులు మంజూరుకాలేదు. దీంతో నీళ్ల పోయడం లేదు. నిధులు రాగానే నీటిని పోయడం ప్రారంభిస్తాం. కొన్ని కుంటల ద్వారా జంతువులకు కొంత వరకు దాహం తీరుతోంది.

–జోజి, ఇన్‌చార్జ్ డీఎఫ్ఓ

జీవాలు విలవిల



మడుగులోని నీటిని తాగుతున్న జీవాలు

మండుతున్న ఎండలకు చెరువులు, కుంటల్లో నీటి మట్టాలు తగ్గిపోతున్నాయి. దీంతో గొల్ల కురుమల జీవనాధారమైన జీవాల దాహార్తిని తీర్చడానికి నానా తంటాలు పడుతున్నారు. మండే ఎండల్లో పచ్చిక బయళ్లు లేక పోవడంతో జీవాలు ఆకలితో అలమటించే పరిస్థితులు ఉన్నాయని గొల్ల కురుమలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దూర ప్రాంతాల్లో ఉన్న నీటి వనరుల వద్దకు తీసుకెళ్లి వాటి దాహార్తిని తీర్చాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయని వాపోతున్నారు. మిరుదొడ్డి శివారులోని మడుగులో ఉన్న నీటిని తాగుతూ దాహార్తిని తీర్చుకుంటున్న జీవాలను 'సాక్షి' కెమెరా ఇలా క్లిక్‌మనిపించింది.

– మిరుదొడ్డి (దుబ్బాక)



లక్ష్యంతో చదివితే విజయం మీదే

- కలెక్టర్ మనుచౌదరి
- సివిల్స్‌పై విద్యార్థులకు అవగాహన



మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేటఎడ్యుకేషన్: స్పష్టమైన లక్ష్యం, నిర్దిష్టమైన ప్రణాళికతో చదివితే సివిల్ సర్వీసెస్‌లో విజయం సాధించవచ్చని కలెక్టర్ మనుచౌదరి అన్నారు. సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాల తెలంగాణ స్కిల్ నాలెడ్జ్ సెంటర్, కెరీర్ గైడెన్స్ సెల్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక కళాశాలలో సివిల్ సర్వీసెస్ పరీక్షలపై అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. డిగ్రీ తర్వాత విద్యార్థులకు ఎలాంటి కెరీర్‌ను ఎంచుకోవాలో కొంత అస్పష్టత ఉంటుందన్నారు. స్పష్టమైన ఆలోచనతో కెరీర్‌ను ప్లాన్ చేసుకోవాలని సూచించారు. భాషపై పట్టు, సబ్జెక్ట్ పరిజ్ఞానం ఉంటే తెలుగులో కూడా సివిల్స్‌లో విజయం సాధించవచ్చన్నారు. సోషల్ మీడియాకు దూరంగా ఉంటూ దినపత్రికలను చదవాలని సూచించారు. తాను మొదటి సారి సివిల్స్ సాధించి విషయాన్ని విద్యార్థులకు వివరిస్తూ, అవసరమైన పుస్తకాలను అందిస్తానని హామీ ఇచ్చారు. ప్రిలిమినరీ, మెయిన్స్ పరీక్షల్లో ఉండే పేపర్లు, మార్కుల విధానం, ఇంటర్వ్యూకు ఎలా సిద్ధం కావాలో, రిఫరెన్స్ పుస్తకాలు, నోట్స్ ఎలా తయారు చేసుకోవాలి తదితర అంశాలను విపులంగా వివరించారు. అనంతరం విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. సుమారు రెండు గంటల పాటు సమయాన్ని కేటాయించి విద్యార్థులకు సివిల్స్ పరీక్షలపై అవగాహన కల్పించిన కలెక్టర్‌ను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సునీత అధ్యాపకులు సన్మానించి, జ్ఞాపికను అందించి, ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్లానింగ్ విభాగం సెక్టోరల్ అధికారి రామస్వామి, కళాశాల టీఎస్‌కేసీ కోఆర్డినేటర్ డాక్టర్ ఉమామహేశ్వరి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అయోధ్యరెడ్డి, సీఓఈ డాక్టర్ గోపాలసుదర్శనం, డాక్టర్ మధుసూదన్, ఏఓ సులేమాన్, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పట్టించుకోరేం

అసెంబ్లీలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు గడుస్తున్నా పల్లెలను పట్టించుకోకపోవడంతో ప్రజల అవస్థలు అన్నీ ఇన్నీకావని మంగళవారం అసెంబ్లీలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి గళమెత్తారు. కేసీఆర్ హయాంలో గ్రామీణ ప్రగతి వికాసంతో పల్లెలు జాతీయ స్థాయిలో ప్రతిష్ట పొందగా నేడు కన్నీరు పెడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు కూడా సక్రమంగా ఇవ్వడంలేదన్నారు. మాజీ సర్పంచ్‌ల చేసిన పనుల బిల్లులు ఇంత వరకు ఇవ్వకపోవడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై వెంటనే ప్రభుత్వం సమీక్షించి సమస్యలు పరిష్కరించాలన్నారు.

వల్లభాపూర్‌ను నార్సింగ్ మండలంలో చేర్చండి

ఉమ్మడి చేగుంట మండలంలోని వల్లభాపూర్‌ను నార్సింగ్ మండలంలో చేర్చాలని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అసెంబ్లీలో కోరారు. చేగుంట, నార్సింగ్ కొత్త మండలాలుగా ఏర్పాటయ్యాయన్నారు. వల్లభాపూర్‌ను నార్సింగ్ మండలంలోకి, అలాగే భీమరావుపల్లిని చేగుంట మండలంలోకి చేర్చాలని విన్నవించారు. ఈ రెండు గ్రామాలు సాంకేతిక కారణాలతో ఓ మండలంలో ఉండాల్సిన గ్రామం మరో మండలంలో ఉన్నాయని, దీంతో ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ రెండు గ్రామాలను సరిచేయాలని కలెక్టర్‌కు పలుసార్లు విన్నవించానన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎల్‌ఆర్‌ఎస్‌ను వేగిరం చేయండి

సిద్దిపేటరూరల్: ఎల్‌ఆర్‌ఎస్ పనులు ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని కలెక్టర్ మనుచౌదరి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో ఎంపీడీఓ, మున్సిపల్ కమిషనర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్‌ఆర్‌ఎస్ డాక్యుమెంట్ అప్‌లోడ్, ఆన్‌లైన్ డేటా ఎంట్రీ, ఎఫ్టీఎల్, నిషేధిత భూములు తదితర అంశాలపై అధికారులకు అవగాహన కల్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ నిషేధిత భూముల వివరాలపై స్పష్టత కలిగి ఉండాలన్నారు. ఎల్‌ఆర్‌ఎస్‌లో ఫీజు జనరేట్ అయి, చెల్లించడానికి సిద్ధంగా ఉన్న వారి వివరాలను తెలుసుకొని సకాలంలో వారు ఫీజు చెల్లించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అదేవిధంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి ఉన్న దరఖాస్తులు మరోసారి పరిశీలించాలన్నారు. అత్యంత పేదరికంలో ఉన్న వారికి రుణాలు ఇప్పించి నిర్మాణాలను పూర్తి చేయించాలన్నారు. వాటికి రీయింబర్స్ మెంట్ చేసుకోవాలని సూచించారు. బేస్‌మెంట్ వరకు పూర్తయిన పనులకు సంబంధించిన బిల్లులు వెంటనే అప్‌లోడ్ చేయాలని, వాటికి చెల్లింపులు చేయడానికి ప్రభుత్వంసిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో డీపీఓ దేవకిదేవి, డీటీసీపీఓ వందన, హౌసింగ్ పీడీ దామోదర్ రావు పాల్గొన్నారు.

ఎకరాకు రూ.50 వేలు నష్టపరిహారం ఇవ్వాలి

సీపీఎం రాష్ట్ర నేత చుక్కా రాములు

సిద్దిపేటఅర్బన్: నీరు అందక పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50వేలు చొప్పున నష్టపరిహారం చెల్లించాలని, అలాగే రైతులందరికీ రైతుభరోసా వర్తింపజేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చుక్కా రాములు డిమాండ్ చేశారు. స్థానిక కార్మిక, కర్షక భవన్‌లో మంగళవారం నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రిజర్వాయర్లలో నీటిని నింపి సాగు నీరు అందించడంలో ప్రభుత్వం విఫలమైందని, దాని వల్ల పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల వడగళ్ల వానకు దెబ్బతిన్న పంటలపై కూడా సర్వే చేసి నష్టపరిహారం చెల్లించాలని కోరారు. పూర్తిస్థాయిలో రైతు భరోసా అమలుకావడం లేదని, సాగు చేసే ప్రతి రైతుకు భరోసా అందించి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి, కార్యదర్శి వర్గ సభ్యులు గోపాలస్వామి, శశిధర్, సత్తిరెడ్డి, భాస్కర్, జిల్లా కమిటీ సభ్యులు వెంకట్, యాదగిరి, రవికుమార్, అరుణ్ పాల్గొన్నారు.



గరుడ వాహనంపై లక్ష్మీనృసింహస్వామివారు

గరుడోత్సవ వైభవం

నాచగిరిలో నేత్రపర్వంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు

వర్గల్(గజ్వేల్): నాచగిరి క్షేత్రంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు నేత్రపర్వం చేస్తున్నాయి. మంగళవారం రాత్రి స్వామివారి పెద్దగరుడ సేవ అంగరంగ వైభవంగా జరిగింది. రాత్రి 10 గంటలకు గరుడోత్సవం ప్రారంభమై అర్ధరాత్రి ఒంటిగంట వరకు కొనసాగింది. ఆలయ ఈఓ విశ్వనాథశర్మ పర్యవేక్షణలో అర్చక పరివారం గరుడాళ్వారు(గరుత్మంతుడు)ను పట్టువస్త్రాలు, వివిధ రకాల పూలమాలికలతో అలంకరించారు. ప్రత్యేక పూజల అనంతరం లక్ష్మీసమేత స్వామివారు గరుడ వాహనం అధిష్టించి పురవీధులలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని తరించారు. స్వామివారి ఆశీస్సులు పొందారు.

హుస్నాబాద్‌కు ఇంజనీరింగ్ కళాశాల

నిర్మాణానికి రూ.44.12 కోట్లు మంజూరు • విద్యార్థుల్లో హర్షాతిరేకాలు

హుస్నాబాద్: స్థానికంగా ఇంజనీరింగ్ కళాశాల మంజూరు చేస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. 2025–26 విద్యా సంవత్సరం నుంచి హుస్నాబాద్‌లో శాతవాహన యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ స్థాపనకు అడ్మినిస్ట్రేటివ్ అనుమతినిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. కళాశాలలో బీటెక్ (సీఎస్‌ఈ), ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, బీటెక్ (ఐటీ), బీటెక్ (ఈసీఈ) ప్రతి ప్రొగ్రాంలో 60 సీట్లను కేటాయించారు. కళాశాల నిర్మాణం కోసం రూ.44.12 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇటీవల ఇంజనీరింగ్ కళాశాల కోసం కలెక్టర్ మనుచౌదరి, శాతవాహన యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఉమేష్ కుమార్ అనువైన స్థలాలను పరిశీలన చేశారు.



స్థల పరిశీలన చేస్తున్న కలెక్టర్ మనుచౌదరి, శాతవాహన యూనివర్సిటీ వీసీ ఉమేష్ (ఫైల్)

ఎన్నో ఏళ్ల నిరీక్షణ

హుస్నాబాద్ నియోజకవర్గంలో ఇంజనీరింగ్ కళాశాల కావాలన్న ఈ ప్రాంత ప్రజలు, విద్యార్థుల కల నెరవేరనుంది. హుస్నాబాద్‌లో డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలలు మాత్రమే ఉన్నాయి. పైచదువులు చదవాలంటే పట్టణాలు, నగరాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేది. నియోజకవర్గంలో గిరిజన జనాభా అధికం. అసెంబ్లీ ఎన్నికల ప్రచార సమయంలో కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ.. పొన్నం ప్రభాకర్‌ను గెలిపిస్తే మెడికల్ కళాశాలను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. పొన్నం ప్రభాకర్ ఎమ్మెల్యేగా గెలిచి మంత్రి అయ్యారు. అప్పటి నుంచి ఏదో ఒక విద్యాసంస్థ వస్తుందని విద్యార్థి లోకం ఎదురు చూసింది. మెడికల్ కళాశాల ఏర్పాటుకు సైతం జిల్లెల్లగడ్డలో కలెక్టర్ పలు మార్లు స్థలాన్ని పరిశీలించారు. దీంతో ఈ ప్రాంత ప్రజల్లో ఆశలు చిగురించాయి. మెడికల్ కళాశాలకు అనుబంధంగా 250 పడకల ఆస్పత్రి ఉండాలనే నిబంధనతో మంత్రి పొన్నం ప్రభాకర్ 250 పడకల ఆస్పత్రిని మంజూరు చేయించడమే కాకుండా ఆస్పత్రి నిర్మాణానికి రూ.88 కోట్లు ప్రభుత్వం నుంచి మంజూరు చేయించారు. ప్రస్తుతం హుస్నాబాద్‌లో శాతవాహన యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలను ప్రభుత్వం మంజూరు చేయడంతో విద్యార్థి లోకం హర్షం వ్యక్తం చేస్తోంది. అలాగే అక్కన్నపేట మండలంలోని చౌటపల్లి, తోటపల్లి, జనగామ గ్రామాల్లోని 124.36 ఎకరాల భూమిలో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. స్థల సేకరణపై గ్రామ సభల ద్వారా రైతుల అభిప్రాయాలు తెలుసుకుంటున్నారు. కరీంనగర్, సిద్దిపేట, హన్మకొండ జిల్లాలకు ఏటు చూసిన 40 కి.మీ. పరిధిలో హుస్నాబాద్ కేంద్ర బిందువుగా ఉంది. ఎల్కతుర్తి నుంచి హుస్నాబాద్ మీదుగా సిద్దిపేట వరకు జాతీయ రహదారి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇన్ని హంగులతో విద్యాసంస్థలు, ఇండస్ట్రీయల్ పార్క్ ఏర్పాటైతే హుస్నాబాద్ ప్రాంతం పారిశ్రామికంగా, విద్యాపరంగా ఎంతో అభివృద్ధి చెందే అవకాశం ఉంది.

క్లుప్తంగా

జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు బెజ్జంకి విద్యార్థి


క్రీడాకారుడు అరవింద్

బెజ్జంకి(సిద్దిపేట): జాతీయ స్థాయి అండర్ 19 హ్యాండ్ బాల్ పోటీలకు బెజ్జంకి మండల కేంద్రానికి చెందిన బొనగిరి అరవింద్ ఎంపికైనట్లు హ్యాండ్ బాల్ జిల్లా కార్యదర్శి మల్లేశం కుటుంబ సభ్యులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అరవింద్ హైదరాబాద్‌లో ఇంటర్మీడియట్ పూర్తి చేసి పారామెడికల్ చదువుతున్నాడు. జనవరి 18న కరీంనగర్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్ 19 పోటీల్లో ప్రతిభ కనబరిచిన అరవింద్ జాతీయ జట్టుకు ఎంపికయ్యారు. నేటి నుంచి బీహార్‌లోని జెహనాబాద్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. అరవింద్‌ను రాష్ట్ర అడ్వైజర్ కమిటీ సభ్యులు కనుకయ్య, బెజ్జంకిలోని ఆర్‌వీఎంటీపీ అకాడమీ సభ్యులు రవి, మధు, డీవీరావు అభినందించారు.

ఏఐలో విద్యార్థిని ప్రతిభ

- గూగుల్‌లో రీసెర్చ్ పత్రాలు
- అమెజాన్‌లో సైతం పుస్తక రూపంలో స్థానం


తన్వీర్ సుల్తానా

కోహెడ(హుస్నాబాద్): కోహెడ మండల కేంద్రానికి చెందిన ఎండీ తన్వీర్ సుల్తానా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ రీసెర్చ్‌లో ప్రతిభ కనబర్చారు. అమెరికాలోని మిస్సోరి విశ్వవిద్యాలయంలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో సుల్తానా పీహెచ్‌డీ చేస్తున్నారు. ఈ క్రమంలో కృత్రిమ మేధ (ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్)లో మిషన్ లెర్నింగ్ ఇన్ కంప్యూటర్ నెట్‌వర్క్ అనే అంశంపై రీసెర్చ్ చేశారు. వాషింగ్టన్‌లో జరిగిన పదవ ఐఈఈఈ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ సదస్సులో విద్యార్థిని చేపట్టిన రీసెర్చ్ పత్రాలను పరిశీలించారు. ప్రాముఖ్యత దృష్ట్యా గూగుల్‌లో స్థానం కల్పించినట్లు తెలిపారు. రీసెర్చ్ పత్రాలన్నీ పుస్తక రూపంలో అమెజాన్‌లో సైతం స్థానం పొందినట్లు చెప్పారు. ఈ సందర్భంగా భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు ఎదగాలని గ్రామస్తులు ఆకాంక్షించారు.

ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడి మృతి


పాడె మోసిన మంద కృష్ణ మాదిగ


పాడె మోస్తున్న మంద కృష్ణ మాదిగ

నంగునూరు(సిద్దిపేట): ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు నంగునూరు మండలం నర్మేటకు చెందిన గందమల్ల యాదగిరి (40) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఎస్సీ వర్గీకరణ కోసం అనేక ఉద్యమాల్లో పాల్గొన్న యాదగిరి జిల్లా వ్యాప్తంగా ఎమ్మార్పీఎస్ బలోపేతానికి కృషి చేశారు. ఆయన సేవలను గుర్తించిన మంద కృష్ణ మాదిగ యాదగిరిని మెదక్ జిల్లా అధ్యక్షుడిగా నియమించారు. కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతూ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మందకృష్ణ మాదిగ యాదగిరి కుటుంబాన్ని ఓదార్చారు. ఈ సందర్భంగా నివాళులర్పించి డప్పు కొట్టి పాడె మోస్తూ అంత్యక్రియల్లో పాల్గొన్నాడు. యాదగిరి పెద్ద కూతురు శ్రీచందన నర్మేట ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతూ ప్రస్తుతం పరీక్షలు రాస్తోంది. ఇంటికి పెద్ద దిక్కును కోల్పోయిన నిరుపేద కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

పొలం ఎకరం.. మడిమడికో రకం

పల్లేరులు మొలిచిన చోట పసిడి పంటలు


తోటలోని క్యాబేజీని చూపిస్తున్న వెంకటరావు

- బంతి పూలు, స్వీట్‌కార్న్, కూరగాయలు సాగు
- ఏడు పదుల వయస్సులోనూ వ్యవసాయం
- ఆదర్శంగా నిలుస్తున్న తోటపల్లి గ్రామానికి చెందిన మంతెన వెంకటరావు

హుస్నాబాద్‌రూరల్: పల్లేరులు మొలిచే దుబ్బ నేల కరువు నీళ్లకు ఏం ఎవుసం చేసినా ఏ పంటలు పడుతాయి, రూ.లక్షలు పెట్టి బోరువేసినా కొద్దిపాటి నీరే వచ్చే, ఏ పంట వేసినా చేతికి వచ్చే వరకు బోరు నీరు పోస్తదా..? అనే సందేహం ఆ ఏడు పదుల రైతును ఆలోచింపజేసింది. బాటన పోయేవారు ఏలెత్తి చూపి గీ.. నీళ్లకు ఏం ఎవుసం చేత్తవ్ అనే వాళ్లే తప్ప ప్రోత్సహించే వారు లేరు. రైతుకు తన మదిలో మెదిలే ఆలోచనలను ఒక్కొక్కటి అమలు చేసి ఎకరం భూమిలో 20 రకాల పంటలను సాగు చేసి పల్లేరులు మొలసిన చోటనే పసిడి పంటలు పండించి వ్యవసాయంలో ఆదర్శంగా నిలుస్తున్నాడు ఏడు పదుల రైతు వెంకటరావు..

హుస్నాబాద్ మండలం తోటపల్లి గ్రామానికి చెందిన మంతెన వెంకటరావు డిగ్రీ పూర్తి చేసినా ఉద్యోగం రాకపోవడంతో వ్యాపారంలోకి దిగాడు. హుస్నాబాద్ పట్టణంలో స్థిరపడ్డ వెంకటరావు వ్యవసాయ అవసరాలైన పైపులు, మోటార్ల వ్యాపారం మొదలు పెట్టాడు. ఊరిలో అమ్మానాన్న ఇచ్చిన వ్యవసాయ భూమి వైపు కన్నెత్తి చూడలేదు. పిల్లలను ఉన్నత చదువులు చదివించడంతో ఒక బిడ్డ హైదరాబాద్‌లో వైద్యురాలిగా సేవలందిస్తుంది. వృద్ధాప్యం రావడంతో వ్యాపారం బంద్ చేసి దుకాణంను వేరొకరికి లీజుకు ఇచ్చాడు.

రూ.1.50 లక్షలతో బోరు

పుట్టిన ఊరిలో అమ్మానాన్న ఇచ్చిన ఎకరం వ్యవసాయ భూమిలో ఏదైనా సాగు చేయాలనే ఆలోచన తట్టగానే రూ.1.50 లక్షలతో బోరు వేయించాడు. బోరు నుంచి వచ్చే కొద్దిపాటి నీటితో పంటలు పండించడం కష్టమే అయినా స్వల్పకాలిక పంటలు సాగు చేయాలని నిర్ణయించాడు. వేరుశనగ, బంతి పూలు, మిరప, స్వీట్ కార్న్, బెండ, సోర, వంకాయ, క్యాబేజీ, బీర, కోతి మీర, చిక్కుడు, టమాట కూరగాయలు సాగు చేస్తున్నాడు. స్వల్పకాలిక పంటలు కావడంతో కష్టానికి ఫలితం వస్తుందని రైతు సంతృప్తి వ్యక్తం చేస్తున్నాడు. పల్లేరులు మొలిచిన చోటనే రైతు ఆలోచనతో పసిడి పంటలు తీసి పల్లె రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నాడు.


మిరప తోటలో రైతు


రైతు సాగు చేసిన కూరగాయలు, స్వీట్‌కార్న్ పంటలు

నీరు చూసి పంటలు వేయాలి

బోరు వేసినప్పుడు కొద్దిపాటి నీరే వచ్చింది. ఈ నీళ్లతో ఏ పంటలు పండుతాయని అందరూ అన్నారు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలను సాగు చేయడం వల్ల తక్కువ కాలంలో లాభాలను పొందవచ్చని ఆలోచన వచ్చింది. స్వీట్‌కార్న్, వేరుశనగ, మొక్కజొన్న, కూరగాయలు, మిరప వీటికి మార్కెట్‌లో ఎప్పుడూ డిమాండ్ ఉంటుంది. మూడు గుంటల బంతి పూలు పెడితే రూ.20 వేలు వచ్చినయ్, మిర్చి మూడు నెలల నుంచి కాస్తనే ఉంది. సాగుకు పని చేయదు అన్న భూమిలోనే రకరకాల పంటలు వేస్తున్నాను. మన చేళ్లలో పండిన కాయలు, పంటలు మన ఇంట్లో అవసరాలకు ఉపయోగపడుతున్నాయి.

– మంతెన వెంకటరావు, కిషన్‌నగర్

'నవోదయ' ఫలితాలు విడుదల

- ఆరో తరగతిలో ప్రవేశాలు
- తొమ్మిదో తరగతి ఖాళీ సీట్ల భర్తీ ఫలితాలు కూడా..
- వివరాలు వెల్లడించిన ప్రిన్సిపాల్ రాజేందర్


వర్గల్ నవోదయ విద్యాలయం

వర్గల్(గజ్వేల్): 2025–26 విద్యాసంవత్సరం ఉమ్మడి మెదక్ జిల్లా వర్గల్ నవోదయ విద్యాలయం ఆరో తరగతిలో ప్రవేశం కోసం జనవరి 18న నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఫలితాలు వెల్లడయ్యాయని వర్గల్ నవోదయ ప్రిన్సిపాల్ రాజేందర్ తెలిపారు. ఫలితాల వివరాలను మంగళవారం ఆయన వెల్లడించారు. ప్రవేశ పరీక్ష ద్వారా అర్హత పొందిన అభ్యర్థులకు సమాచారం చేర వేశామని, హాల్ టికెట్ నంబర్, డేట్ ఆఫ్ బర్త్ వివరాలను నవోదయ విద్యాలయ సమితికి చెందిన హెచ్‌టీటీపీఎస్://సీబీఎస్‌ఈఐటీ.ఇన్/సీబీఎస్‌ఈ/2025/ఎన్‌వీఎస్–ఆర్‌ఈఎస్‌యూఎల్‌టీ/రిజల్ట్.ఏఎస్‌పీఎక్స్ వెబ్‌సైట్‌లో నమోదు చేసి ఫలితాలు చూసుకోవచ్చన్నారు. అర్హత పొందిన 80 మంది అభ్యర్థులకు ఫోన్ ద్వారా, పోస్టు ద్వారా సమాచారం చేర వేస్తున్నామని తెలిపారు. ఏదైనా సమాచారం కోసం 94489 01318 నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.

తొమ్మిదో తరగతి ఫలితాలు

నవోదయలో తొమ్మిదో తరగతి ఖాళీ సీట్ల భర్తీ కోసం ఫిబ్రవరి 8న నిర్వహించిన ఎంట్రెన్స్ పరీక్ష (లేటరల్ ఎంట్రీ) ఫలితాలు మంగళవారం విడుదలైనట్లు ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. హాల్‌టికెట్ నెంబర్, డేట్ ఆఫ్ బర్త్ వివరాలు నమోదు చేసి ఫలితాలను నవోదయ విద్యాలయ సమితికి చెందిన హెచ్‌టీటీపీఎస్://సీబీఎస్‌ఈఐటీ.ఇన్/సీబీఎస్‌ఈ/2025/ఎన్‌వీఎస్–ఆర్‌ఈఎస్‌యూఎల్‌టీ/ఆర్‌ఈఎస్‌సీఎల్‌ఎస్‌ఐఎక్స్.ఏఎస్‌పీఎక్స్ వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చన్నారు.

వందేళ్ల చరిత్ర గల పార్టీ సీపీఐ


మాట్లాడుతున్న వెంకట్‌రెడ్డి

- జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే వెంకట్‌రెడ్డి
- చేర్యాలలో శతవసంత ర్యాలీ, బహిరంగ సభ

చేర్యాల(సిద్దిపేట): వందేళ్ల చరిత్ర కలిగిన పార్టీ సీపీఐ అని, పార్టీ నిర్మాణానికి కార్యకర్తలు సన్నద్ధం కావాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. పార్టీ శతవసంత వార్షికోత్సవాల్లో భాగంగా మంగళవారం పట్టణ కేంద్రంలోని గాంధీ చౌరస్తా నుంచి అంగడిబజార్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం షాదీ ఖానాలో జిల్లా కార్యవర్గ సభ్యుడు అందె అశోక్ అధ్యక్షతన బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభలో చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. సామాజిక న్యాయం కోసం అణగారిన వర్గాల ఆశయాల సాధనకు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభించే ప్రజా వ్యతిరేక విధానాలపై అలుపెరగని పోరాటాలు చేసిందన్నారు. 100 ఏళ్ల పోరాటాలు, త్యాగాలు వంటి గొప్ప చరిత్ర కలిగిన ఏకైక పార్టీ సీపీఐ అన్నారు. అనంతరం రాష్ట్ర నాయకులను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్, జనగామ జిల్లా కార్యదర్శి సీహెచ్.రాజారెడ్డి, రాష్ట్ర సమితి సభ్యుడు గడిపె మల్లేశ్, నాయకులు దయానంద రెడ్డి, సత్యనారాయణ, వనేష్, లక్ష్మణ్, శంకర్, జనార్దన్, భూమయ్య, బాలుమోహన్, పద్మ, నరేశ్, రజిని, మమత, మహేందర్, కృష్ణ, భాస్కర్‌రెడ్డి, సుదర్శన్, ప్రేమ్, బాల్‌రెడ్డి, భాస్కర్, బన్సిలాల్, సత్తయ్య, నర్సింహచారి, అశోక్, కనకయ్య, శ్రీకాంత్, సురేందర్, అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

బడులు పరిపూర్ణ వికాస కేంద్రాలు

- డీఈవో రాధాకిషన్ రావు
- పొడిచన్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలో వార్షికోత్సవం


కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు


విద్యార్థుల నృత్య ప్రదర్శన

పాపన్నపేట(మెదక్): ప్రభుత్వ పాఠశాలలు పరిపూర్ణ వికాస కేంద్రాలుగా విరాజిల్లుతున్నాయని జిల్లా విద్యాశాఖాధికారి రాధాకిషన్ రావు అన్నారు. మంగళవారం సాయంత్రం పొడిచన్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో జరిగిన వార్షికోత్సవానికి అదనపు ఎస్పీ మహేందర్, డీఎస్పీ ప్రసన్న కుమార్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒత్తిడి లేకుండా, ఆట పాటలతో నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వ ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారని అన్నారు. అదనపు ఎస్పీ మాట్లాడుతూ.. ఈ రోజు ఉన్నత పదవుల్లో ఉన్నవారంతా ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన వారేనని గుర్తు చేశారు. విద్యార్థులకు చిన్నప్పటి నుంచే దేశభక్తి, విలువలతో కూడిన విద్యను అందించాలని సూచించారు. డీఎస్పీ మాట్లాడుతూ.. వార్షికోత్సవ వేడుకలు చూస్తుంటే, తమ చిన్ననాటి రోజులు గుర్తుకొస్తున్నాయని అన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంఈఓలు ప్రతాప్ రెడ్డి, నీలకంఠం, ఎస్సై శ్రీనివాస్‌గౌడ్, సుదర్శణమూర్తి, నవీన్, రాజిరెడ్డి, ప్రధానోపాధ్యాయులు, టీచర్లు పాల్గొన్నారు.

దొంగల బీభత్సం

- రెండు వేర్వేరు ఇళ్లలో చోరీ
- బంగారు, వెండి ఆభరణాలు అపహరణ

సిద్దిపేటకమాన్: రెండు వేర్వేరు తాళం వేసిన ఇళ్లలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన ఘటన సిద్దిపేట పట్టణంలో చోటు చేసుకుంది. టూటౌన్ సీఐ ఉపేందర్ కథనం మేరకు.. గజ్వేల్ ఏటిగడ్డ కిష్టాపూర్‌కు చెందిన అన్నాదమ్ముళ్లు గొడుగు భూపాల్, దేవరాజు కుటుంబాలు తొమ్మిదేళ్ల కిందట వలసొచ్చి పట్టణంలోని శంకర్‌నగర్‌లో ఉమ్మడి కుటుంబంగా నివాసం ఉంటున్నారు. 13న తల్లి సుగుణ మృతిచెందడంతో ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులందరూ గజ్వేల్ ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి వెళ్లారు. తిరిగి మంగళవారం ఇంటికొచ్చి చూడగా తాళం పగులగొట్టి ఉంది. లోనికి వెళ్లి చూడగా రెండు బీరువాల్లో దాచిన 17.5 గ్రాముల బంగారం, 1120 గ్రాముల వెండి వస్తువులు, రూ.20వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. ఘటనపై బాధితుడు భూపాల్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఇంటి తాళం పగులగొట్టి

మరో ఘటనలో పట్టణంలోని శంకర్‌నగర్‌లో తలారీ సాయికుమార్ తల్లి లక్ష్మీతో కలిసి నివాసం ఉంటున్నారు. 22న లక్ష్మీ ఉద్యోగ నిమిత్తం గట్లమల్యాల పీహెచ్‌సీకి విధులకు వెళ్లింది. సాయికుమార్ ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి ఊరెళ్లారు. తిరిగి సోమవారం సాయంత్రం ఇంటికొచ్చి చూడగా తాళం పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా గల్లాపెట్టె పగులగొట్టి రూ.15 వేల నగదు, 2.5 గ్రాముల బంగారు చెవి కమ్మలు చోరీకి గురైనట్లు గుర్తించారు. ఘటనపై సాయికుమార్ ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎల్లమ్మ ఆలయంలో హుండీ

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని చిలాపూర్‌లోని ఎల్లమ్మ ఆలయంలో సోమవారం రాత్రి దండగులు హుండీ సొమ్ము చోరీ చేశారు. ఆలయానికి వేసిన తాళాన్ని ఇనుప బ్లేడ్‌తో కోసి హుండీని ఎత్తుకెళ్లారని ఆలయ కమిటీ అధ్యక్షుడు కత్తి రవి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఘటనా స్థలాన్ని పరిశీలించి దర్యాప్తు చేపట్టారు.

మల్లన్న ఆలయంలో వేలం పాటలు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మలికార్జున స్వామి ఆలయంలో ఈఓ రామాంజనేయులు ఆధ్వర్యంలో మంగళవారం షాపింగ్ కాంప్లెక్స్ నందు గల షాపులకు సీల్డ్ టెండర్ కమ్ బహిరంగ వేలం నిర్వహించారు. ఈ సందర్భంగా 14 షాపులకు ఒక్కోదానికి ఏడాదికి రూ.87,600, 6 షాపులు ఏడాదికి రూ. 1,23,600 చొప్పున పలువురు పాటపాడి దక్కించుకున్నారు. టెండర్ కోసం 23 వరకు జారీ చేయాల్సి ఉండగా ఆలయ అధికారులు 24న కూడా జారీ చేయడంతో టెండర్ సమయంలో ఆలయ ఈఓతో టెండర్ దారులు వాగ్వాదానికి దిగారు. దీనిపై ఆలయ ఈవో రామాంజనేయులు ను వివరణ కోరగా నిబంధనల ప్రకారమే టెండర్ నిర్వహించినట్లు తెలిపారు.

ఆదాయం రూ.76.13లక్షలు

కొమురవెల్లి(సిద్దిపేట): మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాల్లో చివరి వారానికి సంబంధించిన ఆదాయం రూ.76,13,190 వచ్చినట్లు ఆలయ అధికారులు మంగళవారం తెలిపారు. మొత్తం మూడు రోజులలో వివిధ రకాల మొక్కుబడులు, దర్శనాలు, ప్రసాదం, పట్నాలు, బోనాలు, టికెట్ల అమ్మకాల ద్వారా ఈ ఆదాయం సమకూరినట్లు పేర్కొన్నారు.

చోరీ కేసులో ఇద్దరు అరెస్ట్

సంగారెడ్డి క్రైమ్: దొంగతనం కేసులో పోలీసులు ఇద్దరిని అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు.. ఆదివారం సాయంత్రం పాత బస్టాండ్ శివార్‌లోని ఓ ఫంక్షన్ హాల్ బయట వృద్ధురాలు ఆటో కోసం నిల్చోగ ఇద్దరు వ్యక్తులు బంగారు ఆభరణాలు చోరీకి యత్నించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ఆటో నంబర్ ఆధారంగా నిందితులను గుర్తుంచారు. పట్టణానికి చెందిన లాల్‌బహదూర్ నగర్‌కు చెందిన షేక్ జావీద్, మహ్మమద్ యాదుల్‌ని మంగళవారం అరెస్ట్ చేసి విచారించగా చోరీ చేసినట్లు ఒప్పుకున్నారు. వీరి నుంచి దొంగతనానికి ఉపయోగించిన ఆటోను స్వాధీనం చేసుకున్నాం. నిందితులని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రమేశ్ తెలిపారు.

పీపీఈ కిట్లు ధరించి పనులు చేయాలి


పొలంపల్లి గ్రామ రైతులతో సింజెంటా ప్రతినిధులు

- పొలంపల్లి గ్రామాన్ని సందర్శించిన సింజెంటా గ్లోబల్ టీమ్ సభ్యులు

చేగుంట(తూప్రాన్): పొలం పనులు చేసే సమయాల్లో కొన్ని సందర్భాల్లో పీపీఈ కిట్లు ధరించాలని సింజెంటా సీడ్స్ మేనేజర్ సత్తిరెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని పొలంపల్లి గ్రామాన్ని సింజెంటా గ్లోబల్ టీమ్ సభ్యులు సందర్శించి రైతులకు సూచనలు చేసారు. మేనేజర్ మాట్లాడుతూ.. రైతులు సస్యరక్షణ చర్యల సమయంలో భద్రత కోసం ప్రత్యేక కిట్లు ధరించాలని తెలిపారు. అనంతరం సింజెంటా టీమ్ సభ్యులు రైతులతో మాట్లాడి వ్యవసాయం గ్రామంలో జరుగుతున్న వ్యవసాయం గురించి అడిగి తెలుసుకున్నారు. తమ వంతు సాయంగా గ్రామంలో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామని సింజెంటా ప్రతినిధులు తెలిపారు. ఈకార్యక్రమంలో గ్రామ రైతులు సింజెంటా ప్రతినిధులు పాల్గొన్నారు.

బస్సు ఢీకొని మహిళ మృతి


సాయివ్వ(ఫైల్)

చేగుంట(తూప్రాన్): రోడ్డు దాటుతున్న మహిళను బస్సు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందిన ఘటన స్టేషన్ మాసాయిపేటలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి కథనం మేరకు.. కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండలం కొట్టాల గ్రామానికి చెందిన బోదాసు సాయవ్వ(43) కామారెడ్డి నుంచి రైలులో స్టేషన్ మాసాయిపేటకు చేరుకుంది. రైలు దిగి తూప్రాన్ వెళ్లడానికి జాతీయ రహదారిపైకి వచ్చి రోడ్డు దాటుతుండగా చేగుంట వైపు నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఓ ట్రావెల్స్ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి అన్న సాయిలు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉపాధి హామీ కూలీ

ఝరాసంగం(జహీరాబాద్): ఉపాధి హామీ కూలీ మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. మండల పరిధిలోని కుప్పానగర్ గ్రామానికి చెందిన ఉపాధి హామీ కూలీ చాంద్ బీ(55) మంగళవారం ఉదయం కూలీ పనులు ముగించుకొని ఇంటికి తిరిగి వస్తుండగా ఆకస్మాతుగా కింద పడిపోయింది. అక్కడికక్కడే మృతి చెందడంతో విషయాన్ని తోటి కూలీలు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు ఎంపీడీఓ సుధాకర్‌కు సమాచారం ఇచ్చారు. ఆయన ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఆమె కుటుంబానికి ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం అందించేందుకు కృషి చేస్తామన్నారు.


చాంద్ బీ(ఫైల్)

చికిత్స పొందుతూ వ్యక్తి

చేర్యాల(సిద్దిపేట): ప్రమాదవశాత్తు బావిలో పడి గాయపడ్డ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. గ్రామస్తుల కథనం మేరకు.. మండల పరిధిలోని ముస్త్యాల గ్రామానికి చెందిన చిగురు రాజయ్య(68) ఈనెల 18న వ్యవసాయ బావిలో మోటారు బయటకు తీసే క్రమంలో ప్రమాదవశాత్తు బావిలో పడి గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించగా మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు.

పేకాట స్థావరంపై దాడి

సిద్దిపేటకమాన్: పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి పలువరిపై కేసు నమోదు చేసిన ఘటన సిద్దిపేట పట్టణంలో చోటు చేసుకుంది. టూటౌన్ పోలీసుల కథనం మేరకు.. కేసీఆర్ నగర్ డబుల్ బెడ్రూం కాలనీలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందింది. దీంతో దాడి చేసి రూ.1,500 స్వాధీనం చేసుకొని, అక్రమంగా పేకాట ఆడుతున్న ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ కథనం ప్రకారం పట్టణంలోని పలు ప్రాంతాలలో తమ సిబ్బందితో కలిసి నిర్వహించిన వాహన తనిఖీల్లో పది మంది పట్టుబడ్డారు. వారిని మంగళవారం కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రూ.13,500 జరిమానా, వారిలో ఒక్కరికి మూడు రోజుల జైలుశిక్ష విధించినట్లు సీఐ తెలిపారు.

రెండవ పంటలో యాజమాన్య పద్ధతులు

- మెలకువలతో అధిక దిగుబడులు
- చెరకు చెత్తతో పంటకు లాభం
- జహీరాబాద్ డివిజన్ ఏడీఏ భిక్షపతి

జహీరాబాద్ టౌన్: మేలైన యాజమాన్య పద్ధతులు పాటించడం వల్ల చెరకు రెండవ పంట నుంచి అధిక దిగుబడులు సాధించవచ్చు. మోడెం తోటల విషయంలో రైతులు శ్రద్ధ చూపకపోవడం మూలంగా దిగుబడులు పడి పోతున్నాయి. రెండో పంటలో రైతులకు పెట్టుబడి ఖర్చు తక్కువ. యాజమాన్య పద్ధతులను పాటించడం ద్వారా ఫస్ట్ క్రాప్ కంటే రెండో పంటలో అధిక దిగుబడులను సాధించని వ్యవసాయ శాఖ జహీరాబాద్ డివిజన్ ఏడీఏ భిక్షపతి పేర్కొన్నారు. నాణ్యమైన దిగుబడులు పొందాలంటే సమయానుకూలంగా మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలని ఆయన సూచించారు.

జహీరాబాద్ ప్రాంత నేలలు చెరకు పంట సాగుకు అనుకూలం. సుమారు 10 వేల మంది రైతులు దాదాపు 20 వేల ఎకరాల్లో ప్రతీ సంవత్సరం సాగు చేస్తుంటారు. జహీరాబాద్‌తోపాటు జిల్లాలోని సంగారెడ్డి, నారాయణఖేడ్ తదితర నియోజకవర్గాల్లో కూడా రైతులు చెరకు సాగు చేస్తున్నారు. ఫస్ట్ క్రాప్ (మొక్కతోటలు) నరికిన తర్వాత రెండో పంటను మోడం అంటారు. ప్రస్తుతం చెరకు సీజన్ ముగియడంతో రైతులు రెండో పంట సాగుపై దృష్టి పెట్టారు.



యాజమాన్య పద్ధతులు

- చెరకు పంటను నరికిన వెంటనే మోడులను భూమికి సమాంతరంగా నరికి వేయాలి. పిలకలు భూమి లోపల నుంచి వచ్చి బలీయంగా ఎదిగి వస్తాయి. అధికంగా పిలకలు వచ్చి పంట దిగుబడులు పెరిగేందుకు దోహదపడుతుంది.
- చెత్తను కాల్చి వేయకుండా ఆకులు కుళ్లినట్లు చేస్తే సేంద్రియ ఎరువుగా మారుతుంది. ఇలా చేయడం ద్వారా ఎకరానికి 3 నుంచి 4 టన్నుల మేర సేంద్రియ ఎరువు ఉత్పత్తి అవుతుంది.


జహీరాబాద్‌లో సాగవుతున్న చెరకు పంట

- తోట నరికిన వెంటనే నీటి తడులు ఇచ్చిన తర్వాత అదును చూసుకొని బొదెను నాగలితో రెండు పక్కల దున్నాలి. ఇలా దున్నిన సాళ్లలో యూరియా రెండు బస్తాలు, ఎస్ఎస్‌పీ నాలుగు బస్తాలు, ఎంఓపీ ఒక బస్తా వంతున కలిపి వేయాలి. తర్వాత పక్కన నాగలితో దున్నినట్లయితే ఎరువు పూర్తిగా కప్పబడి చెరకు పంట ఏపుగా పెరుగుతుంది.
- బోదెను చీల్చడం ద్వార పాత వేరు తెగి కొత్త వేర్లు అభివృద్ధి చెందుతాయి. ఈ కొత్త వేర్లు చురుకుగా ఉండి భూమిలోని పోషకాలను, నీటిని, గాలిని గ్రహించి వాటికి శక్తి పెరుగుతుంది.
- తోటలో దున్నడం ద్వారా వేర్లకు కావాల్సిన గాలి అంది మొక్క వృద్ధి చెందడంతోపాటు పిలకలు అధికంగా వచ్చే అవకాశముంది.
- మోడెంలో మొక్కలకు మొక్కలకు మధ్య రెండు నుంచి మూడు అడుగుల ఖాళీలు ఉన్నట్లయితే నింపడం వల్ల పంట నాణ్యత పెరుగుతుంది.
- మోడెం తోటలలో రైతులు బోదెలను దున్నిన వెంటనే మట్టిని మోదులపైకి ఎగ దోస్తున్నారు. దీని వల్ల పిలకల శాతం గణనీయంగా తగ్గి పంట దిగుబడులు పడి పోయే ప్రమాదముంది. మోదులపైకి రెండు నెలల వరకు మట్టిని ఎగతీయకుండా చూడాలి. రెండో పంటలో ఫస్ట్ క్రాంప్ తోట కంటే ఒకటిన్నర శాతం ఎక్కువ నత్రజని వాడాలి. ఇలా యాజమాన్య పద్ధతులు పాటిస్తే దిగుబడి పెరుగుతుందని ఏడీఏ వివరించారు.

క్లుప్తంగా

అందరి కృషి అవసరం



నియామక పత్రం అందజేస్తున్న హరికృష్ణ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): కాంగ్రెస్ పార్టీ బలో పేతానికి ప్రతి నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి హరికృష్ణ అన్నారు. పార్టీ కార్యాలయంలో మంగళవారం బూరుగుపల్లి గ్రామశాఖ అధ్యక్షుడిగా బందెల కనకయ్యను నియమిస్తూ నియామక పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు భిక్షపతి, డీసీసీ మహిళా అధ్యక్షురాలు లక్ష్మి, నాయకులు యాదగిరి, సందీప్, బాలయ్య, సంతోష, వనజ, రజని, సన తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పొన్నం చిత్ర పటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న విద్యార్థులు

హుస్నాబాద్: శాతవాహన యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల మంజూరుకు కృషి చేసినందుకు హర్షం వ్యక్తం చేస్తూ ఎస్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో విద్యార్థులు మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్ర పటానికి మంగళవారం క్షీరాభిషేకం చేశారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు విశ్వతేజ్ మంత్రి పొన్నంకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు విద్యాసాగర్, రాహుల్, అనిల్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు బహుమతులు



విద్యార్థులతో ఉపాధ్యాయులు

బెజ్జంకి(సిద్దిపేట): చిన్నారులలో సృజనాత్మకతను వెలికితీయాలని ఎంఈఓ మహాలక్ష్మి అన్నారు. ఎంఆర్‌సీ కార్యాలయంలో రెండో తరగతి నుంచి 4వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఎఫ్ఎల్ఎన్ ఫౌండేషన్ లిటరసీ న్యూమరాలజీ) పోటీలను మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆమె పలు సూచనలు చేశారు. అనంతరం ప్రతిభ కబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు శ్రీనివాస్, సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



మాట్లాడుతున్న బ్యాంక్ అధికారి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ప్రతి ఒక్కరికీ ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన ఉండాలని లీడ్ బ్యాంక్ అధికారులు అన్నారు. జిల్లా కేంద్రంలోని పభుత్వ నూతన ఉన్నత పాఠశాలలో మంగళవారం ఉపాధ్యాయులకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో పొదుపు, బడ్జెట్, భవిష్యత్ ప్రణాళిక కోసం పొదుపు, సిబిల్ స్కోర్ నిర్వహణ, విద్యా రుణాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బ్యాంక్ అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణ ఎప్పుడు!



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

గజ్వేల్‌రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని ముట్రాజ్‌పల్లిలోగల 5, 17వ వార్డులలో ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మహాత్మాగాంధీ విగ్రహాలను ఆవిష్కరించాలని అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు కోరారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్యకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం సంఘం అధ్యక్షుడు మల్లేశం మాట్లాడుతూ ముట్రాజ్‌పల్లి చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన మహనీయుల విగ్రహాలు యేడాది కావస్తున్నా ఆవిష్కరణకు నోచుకోవడం లేదని, ఏప్రిల్ 14న అంబేడ్కర్ జయంతి ఉన్నందున విగ్రహాలను ఆవిష్కరించాలని కోరారు. నరేశ్, నవీన్, శివకుమార్, యాదగిరి, మహేశ్, మల్లేశం, కరుణాకర్, స్వామి, దాసు, రవీందర్, మధు తదితరులు పాల్గొన్నారు.

'ఇందిరమ్మ' నిర్మాణం.. పునాదులకే పరిమితం

సాకారంకాని పేదల సొంతింటి కల
- నిలిచిపోయిన మోడల్ హౌస్ పనులు
- గడువు దాటినా పూర్తికాని లక్ష్యం

పేదల సొంతింటి కల పునాది దశలోనే నిలిచిపోవడం వారిలో తీవ్ర నిరాశకు గురిచేస్తోంది. ఇళ్లులేని వారి కోసం ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు పథకం రూపొందించింది. అందుకు గడువు కూడా నిర్ధారించినా ఆదిలోనే ఆగిపోయాయి.



పునాది దశలోనే ఆగిపోయిన మోడల్ హౌస్ నిర్మాణ పనులు

దుబ్బాకటౌన్: పేద ప్రజల సొంతింటి కలను సాకారం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా మండల కేంద్రాల్లో ముందుగా మోడల్ ఇళ్ల నిర్మాణాలను చేపట్టాలని నిర్ణయించారు. ఈ క్రమంలో దుబ్బాక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో మోడల్ ఇంటి నిర్మాణానికి అధికారులు భూమిపూజ చేశారు. కానీ నెలకావస్తున్నా పనులు మాత్రం పునాదుల దశలోనే నిలిచిపోయాయి. మార్చి చివరి నాటికి నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఉన్నప్పటికీ పట్టించుకునే నాథుడే కరువయ్యారని ప్రజలు వాపోతున్నారు.

స్థల సేకరణలో జాప్యం

దుబ్బాక మున్సిపల్, మండలానికి రెండింటికీ కలిపి దుబ్బాకలో ఒకే మోడల్ హౌస్‌ను నిర్మించాలని అధికారులు నిర్ణయించారు. మొదట స్థల సేకరణలో జాప్యం కావడంతో మున్సిపల్ కార్యాలయం ఆవరణలో పనులు ఆలస్యంగా ప్రారంభించారు. ముగ్గుపోసి నెలదాటింది. ఇప్పటి వరకు కేవలం బేస్‌మెట్ లెవల్ వరకు మాత్రమే పనులు పూర్తయ్యాయి. మోడల్ హౌస్‌ను ఈ నెలాఖరులోగా పూర్తిచేయాలని ప్రభుత్వం గడువు విధించినా పనులు మాత్రం ముందుకు సాగడంలేదు.

పార్కింగ్ సమస్య వల్లే నిలిపివేశాం

దుబ్బాకలో ఇందిరమ్మ మోడల్ ఇంటి నిర్మాణ పనుల్లో కొంత ఆలస్యమైంది. గుంతలు తీసి పిల్లర్లు వేశాం. మున్సిపల్ కార్యాలయం ఆవరణలో వాహనాల పార్కింగ్ సమస్య తలెత్తడంతో పనులు నిలిపివేశాం. వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరించి నిర్మాణం చేపడతాం.

– దామోదర్‌రావు, హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్



ఆలయం భక్తుల సందడి

పోచమ్మతల్లి.. పోయొస్తాం

- ఘనంగా ముగిసిన ఉత్సవాలు

జగదేవ్‌పూర్(గజ్వేల్): మూడు నెలలుగా సాగుతున్న కొండపోచమ్మ తల్లి ఉత్సవాలు మంగళవారంతో ఘనంగా ముగిశాయి. సంక్రాంతి నుంచి ప్రారంభమైన అమ్మవారి జాతర ప్రతి సోమ, మంగళవారాల్లో ఉధృతంగా కొనసాగింది. తొమ్మిది వారాల పాటు భక్తులు వేల సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకొన్నారు. కొమురవెల్లి మల్లన్నను దర్శించుకొనే భక్తులు కొండపోచమ్మ చెంతకు చేరుకోవడం ఆనవాయితీ. చివరివారం సోమవారం తెల్లవారుజామున మల్లన్న వద్ద అగ్ని గుండాలు చూసి భక్తులు సోమవారం సాయంత్రం, మంగళవారాల్లో కొండపోచమ్మ ఆలయానికి చేరుకుని బోనాలు చేసి అమ్మవారికి నేవైద్యం సమర్పించారు. మంగళవారం చివరివారం కావడంతో శివసత్తుల శిగాలతో పోతరాజుల నృత్యాలతో ఆలయం మారుమోగింది. భక్తులకు ఇబ్బంది కలగకుండా సిబ్బంది ఏర్పాట్లు చేశారు. ఆలయ ఈఓ రవికుమార్ మాట్లాడుతూ మూడు నెలలుగా సాగిన ఉత్సవాలు మంగళవారంతో ముగిశాయన్నారు.

కాంగ్రెస్‌తో ముస్లింలకు అన్యాయం

- ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి
- దుబ్బాకలో ఘనంగా ఇఫ్తార్ విందు



నమాజ్ చేస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక: కాంగ్రెస్ హయాంలో ముస్లింలకు అన్ని విధాలుగా అన్యాయం జరుగుతోందని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. రంజాన్‌ను పురస్కరించుకొని మంగళవారం సాయంత్రం ముస్లింలకు ఆయన ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ కేసీఆర్ హయాంలో రంజాన్ పండుగ సందర్భంగా పేద ముస్లింలకు కానుకలు పంపిణీ జరిగేదని, ఇప్పుడు ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. రేవంత్ సర్కార్ అన్ని వర్గాలను మోసం చేస్తోందని మండిపడ్డారు. ముస్లింల అభ్యున్నతికి అన్ని విధాలుగా కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో మజీద్ కమిటీ అధ్యక్షుడు ఎండీ ఖలీల్, మత పెద్దలు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోండి

హుస్నాబాద్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న ఉచిత ఆన్‌లైన్ కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ భిక్షపతి సూచించారు. పోటీపరీక్షలపై మంగళవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పలు ప్రవేశ పరీక్షలపై అవగాహన కల్పించడానికి అధ్యాపకులు ముందుకు వచ్చారన్నారు. చంద్రమౌళి, బాలరాజ్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య

ఎంఈఓ కృష్ణ

గజ్వేల్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య అందుతోందని ఎంఈఓ కృష్ణ అన్నారు. మండల పరిధిలోని సింగాటం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఏఐ(ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్) ఆధారిత బోధనను జిల్లా సెక్టోరియల్ అధికారి భాస్కర్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాంకేతికతను జోడించి విద్యార్థులకు బోధించాలని ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. అందులో భాగంగానే ఈ పాఠశాలలో ప్రారంభించామని చెప్పారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడులకు పంపి వారి బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాలని కోరారు. కార్యక్రమంలో హెచ్ఎం సంతోష్, అహ్మదీపూర్ కాంప్లెక్స్ హెచ్ఎం సుగుణాకర్, సింగాటం ఉన్నత పాఠశాల హెచ్ఎం శ్రీధర్‌రెడ్డి, ఉపాధ్యాయులు శేఖర్, కృష్ణ, గ్రామస్తులు శ్రీనివాస్‌గౌడ్, కృష్ణారెడ్డి, రాజశేఖర్ పాల్గొన్నారు.



ఏఐ ఆధారిత విద్యను నేర్చుకొంటున్న విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సహకారం

మద్దూరు(హుస్నాబాద్): పదోతరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని హెచ్ఎం కరుణాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. దుబ్బుడు రాములమ్మ జ్ఞాపకార్థం 1994–95 బ్యాచ్ పూర్వ విద్యార్థులు దూళ్మిట్ట ఉన్నత పాఠశాల హెచ్ఎంకు మంగళవారం రూ.30వేలు అందజేశారు. ఈ యేడాది పదోతరగతిలో పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు బహుమతిగా అందించాలని వారు కోరారు. కార్యక్రమంలో దుబ్బుడు నరసింహారెడ్డి, పూర్వ విద్యార్థులు ప్రశాంత్‌రెడ్డి, సుధాకర్, రామకృష్ణారెడ్డి, హరికిషన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



హెచ్ఎం కరుణాకర్‌రెడ్డికి నగదు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

సేవా భావం అలవాటు చేసుకోవాలి



వాటర్ ప్యూరిఫైడ్ యూనిట్‌ను అందజేస్తున్న కృష్ణతేజ్

న్యాయమూర్తి కృష్ణతేజ్

హుస్నాబాద్: సమాజంలో ప్రతి ఒక్కరు సేవా దృక్పథాన్ని అలవాటు చేసుకోవాలని న్యాయమూర్తి కృష్ణతేజ్ పిలుపునిచ్చారు. భవిత కేంద్రంలో మంగళవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దివ్యాంగుల పిల్లలకు పండ్లు పంపిణీ చేశారు. పట్టణానికి చెందిన నార్ల చంద్రశేఖర్, విజయలక్ష్మి దంపతులు వాటర్ ప్యూరిఫైడ్ యూనిట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణతేజ్ మాట్లాడుతూ దివ్యాంగుల భవిష్యత్ బాగుండాలంటే దాతలు సహాయం చేయాలన్నారు. వారికి ఆట, పాట, మంచి భోజనం అందిస్తే వారికి ఎంతో కొంత సాయం చేసని వాళ్లమవుతామని చెప్పారు. కార్యక్రమంలో ఎంఈఓ బండారి మనీల, హెచ్ఎం వెంకటయ్య, న్యాయవాదులు మురళీకృష్ణ, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులను నిరసిస్తున్నాం..



దుబ్బాకలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలియజేస్తున్న ఆశా వర్కర్లు

అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆశాల ఆందోళన

దుబ్బాక: తమ డిమాండ్ల సాధన కోసం శాంతియుతంగా ధర్నా చేయడానికి హైదరాబాద్ కమిషనరేట్‌కు వెళ్తున్న తమను అక్రమంగా అరెస్టు చేయించడాన్ని నిరసిస్తున్నామని ఆశా వర్కర్లు వాపోయారు. స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి మంగళవారం నిరసన చేపట్టారు. తమ డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని, లేకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మంజుల, నాయకులు శ్యామ ల, భారతమ్మ, అనిత, లత, శారద, సంతోష, చంద్రకళ, సీఐటీయూ టౌన్ కన్వీనర్ భాస్కర్ పాల్గొన్నారు.

తొగుటలో..

తొగుట(దుబ్బాక): స్థానిక బీఆర్ అంబేడ్కర్ చౌరస్తా వద్ద ఆశా కార్యకర్తలు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఆశాలు సోమవారం హైదరాబాద్‌లో ధర్నాకు వెళ్తుంటే పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నిసార్లు విన్నవించినా కాంగ్రెస్ పార్టీ ఆశా కార్యకర్తలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదన్నారు. దీంతో ధర్నా చేయడానికి వెళ్తున్న వారిని పోలీసులు అరెస్ట్ చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సిద్దిపేటలో..

సిద్దిపేటకమాన్: కాంగ్రెస్ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఆశా వర్కర్లు డిమాండ్ చేశారు. అక్రమ అరెస్టులను ఖండిస్తూ అంబేడ్కర్ చౌరస్తాలో ఆశావర్కర్లు మంగళవార తమ కళ్లకు గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూ.18 వేలు కనీస వేతనంతో పాటు, రూ.5 లక్షల రిటైర్‌మెంట్ బెనిఫిట్ ఇవ్వాలన్నారు. అలాగే ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానా

మున్సిపల్ కమిషనర్ ఆశిత్ర్ కుమార్

సిద్దిపేటజోన్: మున్సిపల్ నిబంధనలు అతిక్రమించిన వారికి జరిమానాలు విధిస్తామని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ హెచ్చరించారు. మంగళవారం ఆయన పలు వార్డుల్లో పర్యటించారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డులో పరిశీలించారు. కూరగాయల వ్యర్థాలు బహిరంగ ప్రదేశాల్లో వేయవద్దని, నిబంధనలు ఉల్లంగిస్తే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. అంతకుముందు కొన్ని వార్డుల్లో యూజీడీ మ్యాన్ హోల్ ఛాంబర్‌ను పరిశీలించారు. వాటిలో ప్లాస్టిక్ కవర్లు, శానిటరీ ప్యాడ్స్ ఉండడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్లాస్టిక్ కవర్లు, ప్యాడ్స్ డ్రైనేజీలలో వేయవద్దని స్థానికులకు సూచించారు. కూరగాయల మార్కెట్ సందర్శించి, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనుమతి లేకుండా యూజీడీ కనెక్షన్ తీసుకున్న హోటల్ యజమానికి రూ.15వేలు జరిమానా విధించారు. కాంచిట్ చౌరస్తాలో డ్రైనేజీలో చికెన్ వ్యర్థాలు వేస్తున్న దుకాణదారుడిని గుర్తించి రూ.1500 జరిమానా విధించారు. మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన మహిళ సమాఖ్య సమావేశంలో పాల్గొని రుణాల మంజూరు, రికవరీ గురించి ఆరా తీశారు. సకాలంలో రుణాలు చెల్లించి కొత్త రుణాలు పొందాలని సూచించారు. సమావేశంలోమున్సిపల్, మెప్మా అధికారులు శ్రీకాంత్ హన్మంతరెడ్డి, సంతోషి, సాయి, రమ్య తదితరులు పాల్గొన్నారు.



మార్కెట్‌ను పరిశీలిస్తున్న ఆశ్రిత్‌కుమార్

90 శాతం సబ్సిడీ ఇవ్వాలి

మిరుదొడ్డి(దుబ్బాక): సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకొనే రైతులకు 90శాతం సబ్సిడీ ఇవ్వాలని మాజీ వైస్ ఎంపీపీ పోలీస్ రాజులు డిమాండ్ చేశారు. అల్వాలో రైతులతో కలిసి బీఆర్ఎస్ నాయకులు కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పీఎం కుసుమ్ పథకానికి సంబంధించిన కరపత్రాలతో నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ సంస్థలను మరింత శక్తివంతం చేసి రైతులను ముంచుతున్నాయన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు బాల్‌రాజు, బీఆర్ఎస్ నాయకులు దిలీప్ రెడ్డి, శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

పనులు కల్పించండి




కూలీలతో ఏపీఓ పద్మ

హుస్నాబాద్‌రూరల్: గ్రామాల్లోని కూలీలకు ఉపాధిహామీ పథకంలో పనులు కల్పించాలని ఏపీఓ పద్మ ఆదేశించారు. గాంధీనగర్, తోటపల్లి గ్రామాల్లో జరుగుతున్న పనులను మంగళవారం ఆమె పరిశీలించారు. వేసవి కాలంలో పనులు లేక కూలీలు ఇంటి వద్ద ఉంటారని, వాళ్లను గుర్తించి పనులకు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఆ బాధ్యత ఫీల్డు అసిస్టెంట్లు తీసుకోవాలని, అలాగే పనులుచేసే చోట వడదెబ్బ తగలకుండా చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలని చెప్పారు.

తైబజార్ వేలం రూ.46.46 లక్షలు

గజ్వేల్‌రూరల్: మున్సిపాలిటీ పరిధిలో కూరగాయలు, పశువుల సంత నిర్వహించే తైబజార్ వేలం పాటలో రూ.46.46లక్షలు పలికినట్లు మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ 2025–26 సంవత్సరానికి గానూ పశువుల సంత, కూరగాయల అంగడి కోసం 24న వేలం నిర్వహించారన్నారు. ఈ వేలం పాటలో 23 మంది పాల్గొనగా అత్యధికంగా కూరగాయల అంగడికి రూ.29 లక్షల 50 వేలకు భిక్షపతి దక్కించుకున్నట్లు తెలిపారు. అదేవిధంగా పశువుల సంతకు నిర్వహించిన వేలంపాటలో 32 మంది పాల్గొనగా అత్యధికంగా రూ.16లక్షల 96వేలకు రాజేశం దక్కించుకున్నట్లు చెప్పారు.

శివారెడ్డి అభినందన



సచిన్‌రెడ్డిని అభినందిస్తున్న శివారెడ్డి

సిద్దిపేటజోన్: ఇటీవల విడుదలైన గ్రూప్–2 ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో రెండో ర్యాంక్ సాధించిన సచిన్‌రెడ్డిని ప్రముఖ హాస్యనటుడు, మిమిక్రీ ఆర్టిస్ట్ శివారెడ్డి మంగళవారం అభినందించారు. సిద్దిపేటలోని సచిన్ నివాసంలో ఆయనను శివారెడ్డి సన్మానించారు. ఇదే స్ఫూర్తితో సివిల్స్ సాధించాలని ఆకాంక్షించారు.

సంక్షిప్త వార్తలు

◆ **ఒకే ఎన్నికతో సమగ్ర అభివృద్ధి**

మద్దూరు(హుస్నాబాద్): ఒకే దేశం, ఒకే ఎన్నికతో దేశం అభివృద్ధి చెందుతుందని జనగామ అసెంబ్లీ కన్వీనర్ దండ్యాల లక్ష్మారెడ్డి అన్నారు. స్థానిక తాజ్ గార్డెన్‌లో 'వన్ నేషన్.. వన్ ఎలక్షన్'పై మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జమిలి ఎన్నికల వల్ల చాలా లాభాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఉదయ్‌రెడ్డి, నాయకులు బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ **'నవోదయ'లో విద్యార్థుల ప్రతిభ**

వర్గల్(గజ్వేల్): మెదక్ జిల్లా వర్గల్ నవోదయ విద్యాలయంలో ఆరోతరగతి ప్రవేశం కోసం నిర్వహించిన ప్రవేశ పరీక్షలో వర్గల్ బాలికలు ప్రతిభ చాటారు. కిష్టనోల్ల అక్షిత రామక్కపేట మండల పరిషత్ పాఠశాలలో చదువుకుంటూ పరీక్షలో ఉత్తీర్ణత సాధించినట్లు హెచ్ఎం రాజు తెలిపారు. అదేవిధంగా వర్గల్ విశ్వభారతి స్కూల్ విద్యార్థిని బండమీది స్టెల్లాప్రిన్సీ ప్రవేశ పరీక్షలో ప్రతిభ చాటి అర్హత సాధించినట్లు స్కూల్ కరెస్పాండెంట్ చెప్పారు. ఆ ఇద్దరినీ హెచ్ఎంలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అభినందించారు.

◆ **1 నుంచి సన్న బియ్యం పంపిణీ**

ములుగు(గజ్వేల్): రేషన్ కార్డులందరికీ ఒకటో తేదీ నుంచి సన్నబియ్యం మాత్రమే పంపిణీ చేయాలని తహసీల్దార్ ఆరీఫా రేషన్ డీలర్లకు సూచించారు. రెవెన్యూ కార్యాలయంలో మంగళవారం రేషన్ డీలర్లతో ఆమె సమావేశం నిర్వహించారు. దొడ్డు బియ్యం పంపిణీ చేయవద్దని, సరుకుల పంపిణీలో సమయపాలన పాటించాలని ఆదేశించారు.

◆ **సిటీజన్స్ క్లబ్‌లో వైద్య శిబిరం**

సిద్దిపేటజోన్: స్వచ్ఛంద సంస్థలు నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల సూచించారు. స్థానిక సిటీజన్ క్లబ్‌లో మెడిరిచ్, నీలకంఠ ఆసుపత్రుల ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్, కౌన్సిలర్లు ప్రవీణ్, విఠోభ, నాగరాజు రెడ్డి, మల్లికార్జున్, అరవింద్ రెడ్డి, సాయి కుమార్, తిరుమల్ రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, సతీశ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

◆ **బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సంజీవరెడ్డి**

దుబ్బాక: దుబ్బాక బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మరిపెద్ది సంజీవరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కోర్టు ఆవరణలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో అధ్యక్షుడిగా సంజీవరెడ్డి ఎన్నికైనట్టు ఎన్నికల అధికారి చిలుకోటి నాగరాజురెడ్డి ప్రకటించారు. ఉపాధ్యక్షుడిగా ప్రతాప్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా అశోక్, సహాయ కార్యదర్శిగా సంతోష్ కుమార్, గ్రంథాలయ కార్యదర్శిగా భూపతిని ఎన్నుకొన్నారు. నూతన కార్యవర్గాన్ని న్యాయవాదులు బాపురావు, భాస్కర్‌రెడ్డి, చంద్రం, శ్రీరాం రామకృష్ణ ప్రభు, శ్రీనివాస్, సంతోష్‌కుమార్, చరణ్‌తేజ, ప్రవీణ్‌కుమార్, మహేశ్, ఉపేందర్, భిక్షపతి తదితరులు ఘనంగా సన్మానించారు.